సాక్షి వైఎస్ఆర్ జిల్లా

ఆదివారం । 19 । అక్టోబర్ । 2025



టపాసులతో భద్రం!
దీపావళి సందర్భంగా.. బాణసంచా కాల్చే సమయంలో జాగ్రత్తలు తీసుకోవాలని వైద్యులు, అగ్నిమాపక అధికారులు సూచిస్తున్నారు. -IIలో



పెండ్లిమర్రి ఎస్ఐ సస్పెన్షన్
పెండ్లిమర్రి పోలీస్ స్టేషన్‌లో ఎస్ఐగా విధులు నిర్వహిస్తున్న జి.మధుసూదన్‌రెడ్డిని సస్పెండ్ చేస్తూ డీఐజీ కోయప్రవీణ్ ఉత్తర్వులు జారీ చేశారు. -IIలో

గరిష్టం/కనిష్టం
30.4/24.5

వాతావరణం
జిల్లాలో శనివారం 24.5 - 30.4 డిగ్రీల మధ్య ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. గంటకు 2.4 కిలోమీటర్ల వేగంతో గాలులు వీచాయి.
- కడప అగ్రికల్చర్

న్యూస్‌రీల్

స్వల్ప వర్షం

కడప అగ్రికల్చర్: ఉపరితల ఆవర్తనం కారణంగా జిల్లాలో వర్షాలు కొనసాగుతున్నాయి. శనివారం స్వల్పంగా వర్షం కురిసింది. అట్లూరు, రాజుపాలెం, ఒంటిమిట్టలలో 2.8 మిల్లీమీటర్లు, కాశినాయన, సిద్దవటంలో 1.2, పోరుమామిళ్లలో 1 ఎంఎం వర్షపాతం నమోదైంది.

20వ తేదీనే దీపావళి

కడప సెవెన్‌రోడ్స్: దీపావళిని ప్రజలు ఈనెల 20వ తేదీన నిర్వహించుకోవాలని శ్రీ లక్ష్మీ సత్యనారాయణస్వామి ఆలయ అర్చకులు, కడప జిల్లా అర్చక పురోహిత సమాఖ్య అధ్యక్షులు కేహెచ్ విజయ్‌భట్టర్ ఒక ప్రకటనలో తెలిపారు. ఈ పండుగ నిర్వహణ విషయంపై ప్రజలు అనుమానాలు వ్యక్తం చేస్తున్నారని ఆయన పేర్కొన్నారు. 20వ తేదీ సోమవారం మధ్యాహ్నం 1:37 గంటలకు అమావాస్య ప్రారంభమై 21వ తేదీ మంగళవారం సాయంత్రం 4:03 వరకు కొనసాగుతుందన్నారు. ఈ కారణంగా 20వ తేదీనే దీపావళి నిర్వహించుకోవాల్సి ఉంటుందని ఆయన వివరించారు.

నవోదయలో ప్రవేశానికి గడువు పెంపు

రాజంపేట: జవహర్ నవోదయ విద్యాలయం (రాజంపేట మండలం నారమరాజుపల్లె)లో 2026–27 సంవత్సరానికి 11 వతరగతిలో ప్రవేశానికి మరోసారి గడువును పెంపుదల చేస్తూ నిర్ణయం తీసుకున్నట్లు ప్రిన్సిపాల్ గంగాధరన్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. దరఖాస్తు చేసుకోవడానికి అన్నమయ్య, కడప జిల్లాకు చెందిన విద్యార్థులు అర్హులన్నారు. పూర్తి వివరాలకు డబ్ల్యూడబ్ల్యూడబ్ల్యూ.ఎన్‌వీవోడీఏవైఏ.జీవోఎన్ వె వెబ్‌సైట్‌ను సందర్శించాలన్నారు. చివరి తేది 23–10–2025 అని వెల్లడించారు.

- 2026–27 సంవత్సరానికి సంబంధించి 9వ తరగతిలో ప్రవేశానికి కూడా గడువును పెంచినట్లు ప్రిన్సిపాల్ గంగాధరన్ తెలిపారు. 23.10.2025 వరకు గడువు ఉందని వెల్లడించారు.

నాగనాథేశ్వరస్వామి ఆలయంలో వేలం



వేలం పాట నిర్వహిస్తున్న అధికారులు

ఖాజీపేట: కార్తీక మాసం సందర్భంగా నాగనాథేశ్వరస్వామి కొండ పైకి వచ్చే భక్తుల తలనీలాలు, టెంకాయలు విక్రయించే విషయమై దేవదాయ శాఖ అధికారులు శనివారం వేలం పాట నిర్వహించారు. తలనీలాలు పోగు చేసుకునే హక్కును రూ.4.50 లక్షలకు మహేష్ దక్కించుకున్నారు. టెంకాయల అమ్మకం కోసం రూ.1.25 లక్షలకు హరిప్రసాద్ పాట పాడారు.

శాస్త్రోక్తంగా స్నపన తిరుమంజనం



నూతన పట్టు వస్త్రాలను తీసుకొస్తున్న టీటీడీ అధికారులు

ఒంటిమిట్ట: ఒంటిమిట్ట శ్రీ కోదండ రామస్వామి దేవాలయంలో శనివారం సీతారామలక్ష్మణ మూర్తులకు స్నపన తిరుమంజనం శాస్త్రోక్తంగా నిర్వహించారు. ముందుగా మూల విరాట్‌కు పంచామృతాభిషేకం జరిపారు. టీటీడీ అధికారులు తీసుకొచ్చిన నూతన పట్టువస్త్రాలు, బంగారు ఆభరాణాలు, తులసి గజమాలలతో సీతారామలక్ష్మణ మూర్తులను అందంగా అలంకరించారు. అనంతరం శాస్త్రోక్తంగా స్నపన తిరుమంజనాన్ని నిర్వహించారు.

'జీఎంసీ'లో పీజీ సీట్లు పెంపు



పీడియాట్రిక్స్ హెచ్ఓడీ, వైద్యులను అభినందిస్తున్న ప్రిన్సిపాల్ జమున

కడప: కడప నగర శివారులోని ప్రభుత్వ వైద్య కళాశాల (రిమ్స్)లో చిన్న పిల్లల విభాగం (పీడియాట్రిక్స్)లో పీజీ సీట్ల సంఖ్య ఏడుకు చేరింది. ఎన్ఎంసీ ఇటీవల 4 పీజీ సీట్లు మంజూరు చేసింది. గతంలో 3 పీజీ సీట్లు ఉండేవి. సీట్ల పెంపు కోసం హెచ్ఓడీతోపాటు వైద్యులు కృషి చేశారని జీఎంసీ ప్రిన్సిపాల్ డాక్టర్ జమున తెలిపారు. శనివారం ప్రిన్సిపాల్ తమ చాంబర్‌లో పీడియాట్రిక్ విభాగం హెచ్ఓడీ డాక్టర్ వై. వంశీధర్, వైద్యులు అనిల్ కిరణ్, పద్మినీ ప్రియా, బి.కె.నిరంజన్‌తోపాటు చిన్న పిల్లల విభాగం వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

మనోడే.. ఫ్రీగా ఇచ్చేయ్..

- లీడ్ స్పేస్ అడ్వర్‌టైజ్‌మెంట్ ఏజెన్సీకి కార్పొరేషన్ దాసోహం
- సర్వోన్నతాధికారి సిఫార్సుతో తలొగ్గుతున్న వైనం
- ట్రాఫిక్ సిగ్నల్స్ ఏర్పాటు పేరుతో 10 ఏళ్లు పన్ను మినహాయింపు





సాక్షి ప్రతినిధి, కడప: 'మీది తెనాలి, మాది తెనాలి, మనది తెనాలి మీకు ఫ్రీ.. ఫ్రీ.. ఫ్రీ..' అని ఓ సినిమాలో డైలాగ్‌తోపాటు సన్నివేశాన్ని కార్పొరేషన్ యంత్రాంగం గుర్తు చేస్తోంది. లీడ్ స్పేస్ అడ్వర్‌టైజ్‌మెంట్ ఏజెన్సీకి దాసోహం అయింది. కార్పొరేషన్‌కు ఏడాదికి వచ్చే రూ.12 లక్షల ఆదాయం వదులుకునేందుకు సిద్ధమైంది. పదేళ్లపాటు 12 హోర్డింగ్స్ ఎలాంటి పన్ను చెల్లించకుండా ఉచితంగా పెట్టుకునేందుకు అనుమతులు ఇచ్చేందుకు సంబంధీకులు సన్నాహాలు చేస్తున్నారు. ఒకే సామాజిక వర్గానికి చెందిన ఓ సర్వోన్నతాధికారి సిఫార్సులతో వేగంగా పావులు కదుపుతున్నారు.

కార్పొరేషన్ ఆదాయానికి గండి

జిల్లా కేంద్రమైన కడపలో లీడ్ స్పేస్ అడ్వర్‌టైజ్‌మెంట్ ఏజెన్సీ రెఫరెన్సు నంబర్ 1550/జి1/2008 ద్వారా 2019 జూలై 17న నగర పాలక సంస్థతో ఒప్పందం చేసుకుంది. 4 ట్రాఫిక్ సిగ్నల్స్ లోకేషన్లలో పన్ను మినహాయింపు పొందింది. బీఓటీ (బిల్డ్ ఆపరేట్ ట్రాన్స్‌ఫోర్ట్) పద్ధతిలో ట్రాఫిక్ సిగ్నల్స్ ఏర్పాటు చేసి, ప్రకటనల హోర్డింగ్స్ ఏర్పాటుకు అనుమతి పొందింది. తాజాగా సంధ్య సర్కిల్, అంబేడ్కర్ సర్కిల్, కృష్ణా సర్కిల్, వినాయక నగర్, అప్సరా, 2వ గాంధీ బొమ్మ సర్కిళ్లలో ట్రాఫిక్ సిగ్నల్స్ ఏర్పాటు అవసరమని కార్పొరేషన్ యంత్రాంగం గుర్తించింది. ఆయా ప్రాంతాల్లో లీడ్ స్పేస్ అడ్వర్‌టైజ్‌మెంట్ ఏజెన్సీ ద్వారా చేపట్టి.. వారికి పదేళ్లపాటు 12 హోర్డింగ్స్ ఏర్పాటు చేసుకునేందుకు అనుమతులు ఇచ్చేందుకు సిద్ధమయ్యారు. ఒక్కొక్క హోర్డింగ్ ద్వారా ఏడాదికి రూ.1 లక్ష పన్ను రూపేణా కార్పొరేషన్‌కు లభించే అవకాశం ఉంది. ఇలా ఏడాదికి రూ.12 లక్షలు పదేళ్లపాటు వదులుకునేందుకు కార్పొరేషన్ యంత్రాంగం సన్నద్ధమైంది. ఈమొత్తం తతంగం వెనుక సర్వోన్నతాధికారి సిఫార్సులు ఉన్నట్లు సమాచారం. అందుకు కారణాలు లేకపోలేదు, పైన చెప్పుకున్నట్లుగా మీది తెనాలి, మాది తెనాలి, మనది తెనాలి అంటూ అంతర్గతంగా చెప్పుకుంటున్నట్లు విశ్వసనీయ సమాచారం.

జనరల్ ఫండ్ ఇష్టారాజ్యంగా ఖర్చు..

కార్పొరేషన్ పాలకమండలి సిఫార్సులు లేకుండా కూడా జనరల్ ఫండ్ ఇష్టారాజ్యంగా వెచ్చిస్తున్నట్లు ఆరోపణలు లేకపోలేదు. ఇటీవల పాలకమండలి ప్రమేయం లేకుండా 48వ డివిజన్‌లో రూ.1.40 కోట్ల కాంట్రాక్టు పని పెట్టినట్లు తెలుస్తోంది. జనరల్ ఫండ్ సైతం పాలకమండలితో నిమిత్తం లేకుండా ఇష్టారాజ్యంగా ఖర్చు చేస్తున్నట్లు సమాచారం. తాజాగా అడ్వర్‌టైజ్‌మెంట్ ఏజెన్సీల పట్ల కూడా ఏకపక్షంగా అనుమతులు ఇచ్చేందుకు సన్నాహాలు చేస్తున్నట్లు తెలుస్తోంది. కర్నూలు లాంటి నగరాల్లో సైతం చిన్నసైజ్ హోర్డింగ్ బోర్డులకు అనుమతులిస్తే, ఆ స్థానంలో కడపలో భారీ స్థాయిలో హోర్డింగ్ బోర్డులకు అనుమతులు సిద్ధం చేస్తున్నట్లు సమాచారం.

కలంపై కూటమి కక్ష



నిజాలను నిర్భయంగా రాస్తున్న పత్రికలపై, విలేకరులపై కూటమి సర్కార్ కక్షగట్టింది. అక్రమ కేసులతో వేధిస్తోంది.పత్రికా కార్యాలయాల్లో సోదాలు, సంపాదకుల ఇళ్లలో తనిఖీల పేరుతో పత్రికా స్వేచ్ఛను హరిస్తోంది.అక్రమ కేసులు బనాయిస్తూ ప్రజాస్వామ్యాన్ని అపహాస్యం చేస్తోంది. మీడియాపై అంక్షలు విధించడం తగదని పలువురు ప్రజాస్వామ్యవాదులు, పార్టీల నాయకులు అభిప్రాయపడతున్నారు.



పాత్రికేయులపై వేధింపులు తగదు



ప్రజాస్వామ్యంలో పత్రికల పాత్ర కీలకం. పాలకులు చేసే తప్పులను పత్రికలు చూపడం సహజం. కల్తీ మద్యంపై వార్త రాసిన సాక్షి ప్రతినిధులపై కేసుల నమోదు, వేధింపులు తగవు. ఎన్డీయే ప్రభుత్వం చేస్తున్న చర్యలు సరికాదు. ప్రభుత్వాలు చేసే లోపాలను ఎత్తిచూపే హక్కు మీడియాకు ఉంది. కక్ష సాధింపు చర్యలు మానుకోవాలి.
- గాలి చంద్ర, సీపీఐ జిల్లా కార్యదర్శి, వైఎస్సార్ జిల్లా

ఉద్దేశ పూర్వకంగానే సాక్షిపై కుట్ర



ఉద్దేశ పూర్వకంగానే ప్రభుత్వం సాక్షి పత్రికపై కుట్రపూరితంగా వ్యవహరిస్తోంది. కూటమి ప్రభుత్వం చేస్తున్న తప్పులను వెలుగులోకి తేవడం నేరం కాదు. తప్పులను ఎత్తిచూపే హక్కు పత్రికలకు ఉంది. స్వయంగా పోలీసు ఉన్నతాధికారులు సాక్షి కార్యాలయానికి వెళ్లడం, సాక్షి ఎడిటర్ ధనుంజయరెడ్డిని ప్రశ్నించడం విడ్డూరంగా ఉంది.
- పోరెడ్డి నరసింహారెడ్డి, వైఎస్సార్‌సీపీ జిల్లా ఉపాధ్యక్షుడు, ప్రొద్దుటూరు

పత్రికా స్వేచ్ఛను కాలరాస్తున్నారు



ఏపీ ప్రభుత్వం పత్రికా స్వేచ్ఛను కాలరాస్తోంది. మీడియాలో ప్రసారం చేసిన వాటిపైన, పేపర్‌లలో వచ్చిన వార్తలపై అభ్యంతరాలు ఉంటే వివరణ ఇవ్వడమో, ఖండించడమో చేయాలి. అలా కాకుండా పోలీసుల ద్వారా నోటీసులు జారీ చేస్తూ మానసికంగా ఇబ్బంది పెట్టడం తగదు.
- బి.దస్తగిరిరెడ్డి, ఏపీ రైతు సంఘం జిల్లా కార్యదర్శి

వాసు.. అధ్యక్షుడని చెప్పుకోవడానికే సిగ్గుచేటు

- బాధిత కుటుంబాన్ని పరామర్శించడానికి రాలేదు
- ఎక్కడి నుంచో వచ్చిన వారికి అందలం
- అసలు కార్యకర్తలు ఎవరో.. నకిలీ వారెవరో చర్చకు సిద్ధమా?
- కడప టీడీపీ సీనియర్ నాయకుల సవాల్



సమావేశంలో మాట్లాడుతున్న కడప టీడీపీ క్లస్టర్ ఇన్‌చార్జి మాబుల్లాఖాన్

కడప రూరల్: 'రెడ్డెప్పగారి శ్రీనివాసులురెడ్డి (వాసు).. ఆయన మా పార్టీ జిల్లా అధ్యక్షుడని చెప్పుకోవడాకే సిగ్గు చేటుగా ఉంది. అది కడప నగర కమిటీ కాదు.. దొంగగా వచ్చి చేరిన వారి కమిటీ' అని కడప నియోజక వర్గానికి చెందిన తెలుగుదేశం పార్టీ సీనియర్ నాయకులు ధ్వజమెత్తారు. శనివారం కడపలోని సాయిపేట తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆ పార్టీ సీనియర్ నాయకులు క్లస్టర్ ఇన్‌చార్జి ఆర్‌కే మాబుల్లాఖాన్ మాట్లాడారు. పార్టీ కడప నగర కమిటీకి అధ్యక్షుడిగా దొంగగా మన్సూర్ అలీఖాన్ వచ్చారన్నారు. నూతనంగా ప్రకటించిన కడప నగర కమిటీ, అసలు తెలుగుదేశం పార్టీ కమిటీనే కాదని తెలిపారు. నగర అధ్యక్షుడు మన్సూర్ అలీఖాన్ అసలు సిసలైన కార్యకర్తల గురించి విమర్శిస్తుంటే దయ్యాలు వేదాలు వల్లించినట్లుగా ఉందన్నారు. అలాగే మరో 8 మంది పార్టీ ఫిరాయింపు కార్పొరేటర్లను దొంగల్లా టీడీపీలోకి తెచ్చారని, వారు పెత్తనం చెలాయిస్తున్నారని పేర్కొన్నారు. తన సోదరుడు, పార్టీ కార్యకర్త కరీంఖాన్ చనిపోయారని అన్నారు. ఆ విషయాన్ని పార్టీ జిల్లా అధ్యక్షుడు శ్రీనివాసులు రెడ్డికి చెబితే, మరణించిన కార్యకర్త కుటుంబాన్ని పరామర్శించడానికి రాకుండా, తనకు బిజీ షెడ్యూల్ ఉందని చెప్పడం ఆయనకే చెల్లిందన్నారు. ఆఖరికి ఎమ్మెల్యే మాధవిరెడ్డి కూడా అటు వైపు కన్నెత్తి చూడలేదని ఆవేదన వ్యక్తం చేశారు. వారు పార్టీ కార్యకర్తలకు ఇచ్చే మర్యాద ఇదేనా అని నిలదీశారు. మానవతా దృక్పదంతో వైఎస్సార్‌సీపీ నాయకులు, మాజీ డిప్యూటీ సీఎం అంజద్‌బాషా సోదరుడు అహ్మద్‌బాషా 80 మంది అనుచరులతో వచ్చి మరణించిన తన సోదరుడి కుటుంబాన్ని పరామర్శించారని తెలిపారు. ఇతర పార్టీ నేతలకు ఉండే దయా హృదయం, ఇంకిత జ్ఞానం శ్రీనివాసులురెడ్డికి లేకపోవడం దారుణమని పేర్కొన్నారు. ఎన్నో ఏళ్లుగా పార్టీ కోసం పని చేస్తున్నామని, అయితే తమకు ఏ మాత్రం గుర్తింపు లేదని ఆవేదన వ్యక్తం చేశారు. 39వ డివిజన్ ముస్లిం మైనార్టీ సీనియర్ నాయకులు షా మొహమ్మద్ మాట్లాడుతూ పార్టీలో సీనియర్ కార్యకర్తలకు ప్రాధాన్యత ఇవ్వకుండా, బయటి నుంచి వచ్చిన వారిని అందలం ఎక్కిస్తున్నారని ఆరోపించారు.

'పుత్తా' వద్దకు వెళ్తుంటే పోలీసుల చేత బెదిరింపులు

కొండ్రెడ్డి జనార్ధన్‌రెడ్డి మాట్లాడుతూ కడప అసెంబ్లీలో టీడీపీ కార్యకర్తల పరిస్థితి అధ్వానంగా మారిందన్నారు. మాధవిరెడ్డి ఎమ్మెల్యేగా గెలిచిన తరువాత సీనియర్ కార్యకర్తలను ఇబ్బందులకు గురి చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. తమ బాధలను ఎవరికి చెప్పుకోవాలో అర్థం గాక, పార్టీ రాష్ట్ర ఉపాధ్యక్షులు పుత్తా నరసింహరెడ్డి వద్దకు వెళ్తున్నామని అన్నారు. ఆయన వద్దకు వెళ్లిన మరుక్షణం పోలీస్ స్టేషన్‌ల నుంచి ఫోన్‌లు.. బెదిరింపులు వస్తున్నాయని వాపోయారు. మాజీ శాప్ డైరెక్టర్ జయచంద్ర మాట్లాడుతూ సీనియర్ కార్యకర్తలపై ఆరోపణలు చేస్తున్న వారు పార్టీ సభ్యత్వం కార్డును చూపించి మాట్లాడాలన్నారు. పార్టీ ఫిరాయింపు దారుల పెత్తనం టీడీపీలో ఎక్కువైందన్నారు. పార్టీ కోసం పని చేసిన అసలు కార్యకర్తలు ఎవరో.. నకిలీ కార్యకర్తలు ఎవరో నిగ్గు తేల్చడానికి ఎన్టీఆర్ విగ్రహం వద్ద బహిరంగ చర్చకు సిద్ధమా అని సవాల్ విసిరారు. కార్యక్రమంలో ఆ పార్టీ కార్యకర్తలు షేక్ సలీం, వాహిద్ తదితరులు పాల్గొన్నారు.

బాలికలు పథకాలు సద్వినియోగం చేసుకోవాలి



మాట్లాడుతున్న ఐసీడీఎస్ పీడీ రమాదేవి

కడప కోటిరెడ్డిసర్కిల్: కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అమలు చేస్తున్న పథకాలను బాలికలు సద్వినియోగం చేసుకోవాలని ఐసీడీఎస్ పీడీ రమాదేవి తెలిపారు. శనివారం జిల్లా స్త్రీ,శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో కలెక్టరేట్‌లోని డిస్ట్రిక్ట్ రిసోర్స్ సెంటర్ ఫర్ చిల్డ్రన్‌లో అంతర్జాతీయ బాలికాదినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ బాలికలకు విద్యా ప్రాముఖ్యత, అంతర్జాతీయ బాలికా దినోత్సవ విశిష్టతను వివరించారు. చీఫ్ లీగల్ ఎయిడ్ ఆఫీసర్ హరిబాబు మాట్లాడుతూ బాలికలు, మహిళలకు డీఎల్ఎస్ఏ ద్వారా కలిగే ప్రయోజనాలు, చట్టాలపై తెలియజేశారు. అవసరమైన వారికి ఉచిత న్యాయ సాయం అందించడం జరుగుతుందని వివరించారు. అనంతరం వ్యాసరచన పోటీలలో ప్రతిభ కనబరచిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో డీఈఎంఓ భారతి, సీడీపీఓ జె.వాణి, డిస్ట్రిక్ట్ మిషన్ కోఆర్డినేటర్ శోభారాణి, మిషన్ వాత్సల్య సిబ్బంది, మిషన్ శక్తి సిబ్బంది, మహిళా పోలీసులు, ఐసీడీఎస్ సూపర్ వైజర్‌లు, విద్యార్థులు పాల్గొన్నారు.

పెద్ద దర్గా ఉరుసుకు విస్తృత ఏర్పాట్లు

కలెక్టర్ డాక్టర్ శ్రీధర్ చెరుకూరి



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ డాక్టర్ శ్రీధర్ చెరుకూరి

కడప సెవెన్‌రోడ్స్: నవంబర్ 4 నుంచి 10వ తేదీ వరకు జరగనున్న 'అమీన్ పీర్ దర్గా' ఉరుసు ఉత్సవాలను కులమతాలకు అతీతంగా ఘనంగా నిర్వహించేందుకు విస్తృత ఏర్పాట్లు చేయాలని కలెక్టర్ శ్రీధర్ చెరుకూరి అధికారులను ఆదేశించారు. శనివారం స్థానిక కలెక్టరేట్‌లో అమీన్‌పీర్ దర్గా ఉత్సవాల నిర్వహణ, ముందస్తు ఏర్పాట్లపై కలెక్టర్ అధ్యక్షతన సమావేశం జరిగింది. జేసీ అదితి సింగ్, జిల్లా ఎస్పీ షెల్కే నచికేత్, డీఆర్వో విశ్వేశ్వరనాయుడు, ఇతర అధికారులు, ఉరుసు ఉత్సవ కమిటీ సభ్యులు హాజరయ్యారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రపంచవ్యాప్త ప్రాముఖ్యం కలిగిన అమీన్ పీర్ దర్గా ఉత్సవాలను కడప నగర ఫెస్టివల్‌గా, మత సామరస్యాన్ని ప్రతిబింబించేలా స్టాండర్డ్ నిబంధనలను పాటిస్తూ ఘనంగా నిర్వహించాలని అధికారులను ఆదేశించారు.15 రోజుల ముందుగానే ముందస్తు ప్రణాళికతో అన్ని రకాల ఉత్సవ ఏర్పాట్లు పూర్తి చేయాలన్నారు. అమీన్ పీర్ దర్గా (పెద్ద దర్గా) కమిటీ సభ్యులు, జిల్లా యంత్రాంగం, అన్ని శాఖల అధికారులు, దర్గా నిర్వాహకులు, ప్రజాప్రతినిధులు, స్వచ్ఛంద సంస్థల ప్రతినిధుల సమన్వయంతో ఉత్సవాలను విజయవంతం చేయాలన్నారు. ఉరుసు ముందస్తు ఏర్పాట్లకు సంబంధించి వివిధ శాఖలకు జిల్లా కలెక్టర్ విధులు కేటాయించారు.

మున్సిపల్ అధికారులు: ప్రధానంగా పారిశుద్ధ్య సిబ్బందిని ఏర్పాటు చేసి భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా ప్రత్యేక శానిటేషన్ కార్యక్రమలను చేపట్టాలన్నారు. మున్సిపల్ శాఖ ఆధ్వర్యంలో పరిశుభ్రత ఏర్పాట్లను చూడాలన్నారు. మొబైల్ టాయిలెట్స్, సురక్షితమైన తాగునీరు, హై మాస్ లైట్లను ఏర్పాటు చేయాలన్నారు. ప్రధాన కూడళ్లను అందంగా విద్యుత్ లైట్లతో అలంకరించాలని సూచించారు.

పోలీస్ శాఖ: పోలీస్ శాఖ కట్టుదిట్టమైన భద్రతా ఏర్పాట్లను చేయాలని, ఎక్కడా ఎలాంటి సంఘటనలకు తావివ్వకుండా గట్టి భద్రతా సిబ్బందిని ఏర్పాటు చేసుకోవాలన్నారు. పెద్ద సంఖ్యలో భక్తులతోపాటు ప్రముఖులు, అత్యంత ప్రముఖులు రానున్న నేపథ్యంలో అంచనాతో అన్ని రకాల ఏర్పాట్లకు ప్రణాళిక సిద్ధం చేయాలన్నారు. ట్రాఫిక్, పార్కింగ్ వంటి అంశాలపై ప్రత్యేక దృష్టి సారించాలన్నారు.

రెవెన్యూ శాఖ: పెద్ద సంఖ్యలో భక్తులు రానున్న నేపథ్యంలో.. ఎక్కువగా గుమికూడే ప్రాంతాలలో బారికేడ్స్‌ను ఏర్పాటు చేయాలన్నారు. దర్గా నుంచి అంబులెన్స్ ద్వారా హాస్పిటల్స్ వెళ్లడానికి గ్రీన్ ఛానల్ దారిని ఏర్పాటు చేయాలన్నారు. వీఐపీ ప్రొటోకాల్, ప్రముఖులకు ప్రజాప్రతినిధులకు దర్గా ఆహ్వానాలు వంటి అంశాలను చూసుకోవాలని డీఆర్‌ఓను ఆదేశించారు.

వైద్య ఆరోగ్య శాఖ: వైద్య ఆరోగ్య శాఖ ద్వారా అధిక సంఖ్యలో వైద్య సిబ్బందిని వైద్యాధికారులను నియమించి ప్రత్యేక వైద్య శిబిరాలు ఏర్పాటు చేయాలన్నారు. 108 అంబులెన్స్ తదితర వాహనాలతోపాటు అత్యవసర మందులు కూడా అందుబాటులో ఉంచాలన్నారు.

పర్యాటక శాఖ: నగరంలోని ఆర్టీసీ బస్టాండు, రైల్వేస్టేషన్, ఎయిర్‌పోర్ట్ ప్రాంతాలలో పెద్ద దర్గా, ఇతర దేవాలయాల టెంపుల్ టూరిజం క్యాంపెయిన్ చేపట్టాలని పర్యాటక అధికారులకు సూచించారు.

ఆర్టీసీ : ప్రధాన ప్రాంతాలైన ఆర్టీసీ బస్టాండ్, రైల్వేస్టేషన్ తదితరాల నుంచి అమీన్ పీర్ పెద్ద దర్గా ప్రాంతానికి షటిల్, బస్సులు నడపాలని ఆర్టీసీ అధికారులను ఆదేశించారు. మన జిల్లా నుంచే కాకుండా ఇతర రాయలసీమ జిల్లాలు, హైదరాబాద్, విజయవాడ వంటి ప్రాంతాల నుంచి ప్రత్యేక బస్సులు నడపాలని సూచించారు.

విద్యుత్ శాఖ: ఎలాంటి అవాంఛనీయ సంఘటనలకు తావు లేకుండా పవర్ మేనేజ్‌మెంట్ చేయాలన్నారు. షార్ట్ సర్క్యూట్లు సంభవించకుండా విద్యుత్ శాఖ అధికారులు జాగ్రత్తలు పాటించాలన్నారు.

అగ్నిమాపక శాఖ: ఎలాంటి అగ్నిప్రమాదాలు జరగకుండా అప్రమత్తంగా వ్యవహరించాలని అగ్నిమాపక శాఖ అధికారులను ఆదేశించారు.

విద్యాశాఖ: అమీన్ పీర్ దర్గా ప్రధాన ఉరుసు మహోత్సవం రోజు అన్ని పాఠశాలలకు సెలవు ప్రకటించాలని ఆదేశించారు.

కంట్రోల్ రూమ్ ఏర్పాటు

గతంలో పెద్ద దర్గా ఉర్సు నేపథ్యంలో కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. ఈ ఏడాది మల్టీ డిస్ప్లినరీ కంట్రోల్ రూమ్ కొనసాగుతుందని, ఇందులో ఏడు శాఖలకు చెందిన అధికారులు విధులు నిర్వహించాలని ఆదేశించారు.

- ఈ కార్యక్రమంలో కడప ఆర్డీవో జాన్ ఇర్విన్, జిల్లా మైనారిటీ ఆఫీసర్ ఇదయతుల్లా, అడిషనల్ ఎస్పీ ప్రకాష్ బాబు, జిల్లా సమాచార శాఖ అధికారి పద్మజ, ఏపీ ఎస్పీడీసీఎల్ ఎస్ఈ రమణ, జిల్లా వైద్య ఆరోగ్యశాఖ నాగరాజు, జిల్లా అగ్నిమాపక అధికారి ధర్మారావు, కడప మున్సిపల్ అడిషనల్ కమిషనర్ రాకేష్, ఇతర జిల్లా అధికారులు, దర్గా కమిటీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

సీఎంకు ఆహ్వానం



సీఎం చంద్రబాబును ఆహ్వానిస్తున్న దర్గా పీఠాధిపతి అరిఫుల్లా హుస్సేనీ సాహెబ్

కడప సెవెన్‌రోడ్స్: కడప అమీన్ పీర్ దర్గా ఉరుసు ఉత్సవాలకు రావాలని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడును ఆహ్వానించారు. అమీన్ పీర్ దర్గా పీఠాధిపతి హజ్రత్ కేఎస్ఎస్ అరిఫుల్లా హుస్సేనీ సాహెబ్.. సీఎంను కలిసి ఆహ్వానం అందించారు. జాతీయ స్థాయిలో పేరొందిన ఈ ఉరుసు మహోత్సవాలు నవంబరు 5వ తేదీ నుంచి 10వ తేదీ వరకు జరుగుతున్నాయని, ఈ మహోత్సవాలకు తప్పనిసరిగా హాజరు కావాలని ముఖ్యమంత్రిని కోరారు. ఈ సందర్భంగా ఉరుసు ఉత్సవ ఏర్పాట్లు ఏ విధంగా జరుగుతున్నాయని సీఎం వారిని అడిగి తెలుసుకున్నారు. ముఖ్యమంత్రిని కలిసిన వారిలో అమీన్ పీర్ దర్గా మేనేజర్ మొహమ్మద్ అలీఖాన్, బాబీ ఉల్లాఖాన్ తదితరులు ఉన్నారు.

క్లుప్తంగా

బైకులు ఢీకొని యువకుడికి గాయాలు



గాయపడిన ప్రదీప్

చింతకొమ్మదిన్నె : మండలంలోని ఊటుకూరు వద్ద జాతీయ రహదారిపై శనివారం సాయంత్రం రెండు బైకులు ఢీకొనడంతో యల్లటూరు ప్రదీప్ అనే యువకుడికి గాయాలయ్యాయి. కాలు విరగడంతో ప్రదీప్‌ను స్థానికులు చికిత్స నిమిత్తం రిమ్స్‌కు తరలించారు.

బీఎస్ఎన్ఎల్ ఆఫర్లను సద్వినియోగం చేసుకోవాలి

కడప వైఎస్‌ఆర్ సర్కిల్ : బీఎస్ఎన్ఎల్ దేశ వ్యాప్తంగా దీపావళి పండుగ బొనాంజా ఆఫర్లను ప్రవేశ పెట్టిందని జిల్లా బీఎస్ఎన్ఎల్ ప్రిన్సిపల్ జనరల్ మేనేజర్ ముజీబ్ పాషా ఒక ప్రకటనలో తెలిపారు. ఈ ఆఫర్‌లో ఒక రూపాయికే 30 రోజుల పాటు ఉచిత వాయిస్ కాల్స్, 2 జీబీ డేటా, వంద ఎస్ఎంఎస్‌లు లభిస్తాయన్నారు. సిమ్ కూడా ఉచితంగా అందిస్తామన్నారు. ఈ నెల 18, 19, 20 తేదీల్లో బీఎస్ఎన్ఎల్ సెల్ఫ్ కేర్ యాప్ ద్వారా గాని, వెబ్‌సైట్ ద్వారా గానీ రూ.100 అంతకంటే ఎక్కువ రీచార్జ్ చేసుకున్న వినియోగదారులకు ప్రతి రోజు పది మందిని లక్కీ డిప్ ద్వారా ఎంచుకొని ఒక్కొక్కరికి సిల్వర్ కాయిన్ గిఫ్ట్ ఇస్తామన్నారు. బీఎస్ఎన్ఎల్ సెల్ఫ్‌కేర్ యాప్ ద్వారా మిత్రులకు గాని, కుటుంబ సభ్యులకు గాని రీచార్జ్ చేసినట్లయితే రీ చార్జ్ అమౌంట్‌లో 25 శాతం డిస్కౌంట్ లభిస్తుందన్నారు. సీనియర్ సిటిజన్స్ కోసం రూ.1812కే 365 రోజుల పాటు అపరిమిత వాయిస్ కాల్స్, ప్రతి రోజు 2జీబీ డేటా, 100 ఎస్ఎంఎస్‌లు లభిస్తాయన్నారు. సిమ్ ఉచితంగా ఇస్తామన్నారు.

టపాసులతో భద్రం!

అప్రమత్తంగా లేకపోతే ప్రమాదమేనంటున్న అధికారులు

కడప వైఎస్‌ఆర్ సర్కిల్ : ఎప్పుడెప్పుడా అని ఎదురు చూస్తున్న వారి కోసమన్నట్లు నరక చతుర్దశి, దీపావళి పర్వదినాలు ఆది, సోమవారాల్లో వచ్చేస్తున్నాయి. మరో రెండు రోజులు ఉండగానే ఉమ్మడి జిల్లాలో పండుగ వాతావరణం సందడి చేస్తోంది. దీపావళి అంటే ముందుగా గుర్తొచ్చేది టపాసుల మోతనే. పల్లెలైనా పట్టణాలైనా దీపావళి నాడు టపాసుల మోతతో దద్దరిల్లాల్సిందే. అయితే బాణసంచా కాల్చే సమయంలో జాగ్రత్తలు తప్పనిసరిగా తీసుకోవాలని వైద్యులు అగ్నిమాపక అధికారులు సూచిస్తున్నారు.



బాణసంచా దుకాణం

ఈ జాగ్రత్తలు తప్పనిసరి..

- కొనుగోలు చేసిన బాణసంచాను ఎట్టి పరిస్థితులలో వంట గదిలోను, పొయ్యి ఉన్న ప్రాంతంలోనూ ఉంచకూడదు. సురక్షిత ప్రదేశంలోనే పెట్టాలి.
- టపాసులను చేతుల్లో పట్టుకుని కాల్చరాదు.
- టపాసులను వెలిగించిన తర్వాత పేలకపోతే వాటిపైకి వంగి చూడడం ప్రమాదం.
- తారాజువ్వలను సీసా బోర్లించిన రేకు డబ్బాలో పెట్టి కాల్చే పద్ధతి కూడా ప్రమాదమే.
- టపాసులు కాల్చే సమయంలో సింథటిక్ దుస్తులు కాకుండా నూలు దుస్తులు ధరించాలి.
- గాలులు విపరీతంగా ఉన్నచోట కాసేపు ఆగి టపాసులు కాల్చాలి. లేదంటే నిప్పురవ్వలు కళ్లను దెబ్బతీసే ప్రమాదం ఉంటుంది.
- బాణసంచా కాల్చే సమయంలో దగ్గరగా నీటిని లేక ఇసుకను అందుబాటులో ఉంచుకోవాలి.
- చిన్నపిల్లలు టపాసులు కాల్చే సమయంలో ఒంటరిగా కాకుండా తల్లిదండ్రులు పక్కన ఉండాలి.
- ఒకవేళ అనుకోని పరిస్థితులలో బాణసంచా వల్ల గాయపడితే సొంత వైద్యం కాకుండా వైద్యులను సంప్రదించాలి. కాలిన చోట రుద్దడం వల్ల చర్మం పాడవుతుంది. ఆసుపత్రికి వెళ్లే వరకు తడి గుడ్డతో కప్పి ఉంచాలి.
- ఇంటి బయట మాత్రమే టపాసులు కాల్చాలి. ఇళ్లల్లో ప్రమాదకర వస్తువులు ఉన్నప్పుడు వాటి తీవ్రత మరింత అధికమవుతుంది.
- విపరీతమైన శబ్దాలను చెవులు భరించలేవు. చెవుల్లో దూది పెట్టుకుంటే రక్షణగా ఉంటుంది.
- అన్ని జాగ్రత్తలు పాటిస్తూనే కళ్లకు, చెవులకు, చర్మానికి ప్రమాదం లేని పెద్ద మోత చేసే టపాసుల కన్నా తారాజువ్వలు, చిచ్చుబుడ్లు, కాకర పొత్తులు, పెన్సిళ్లు, భూచక్రాలు వంటి వాటితో ఆనందంగా దీపావళి పండగ జరుపుకోవడం ఉత్తమం.

జాగ్రత్తలు పాటించాలి..



టపాసులు కాల్చే సమయంలో ప్రజలు సరైన జాగ్రత్తలు పాటించాలి. ముఖ్యంగా ఆరుబయటే టపాసులు కాల్చాలి. ఇరుకు ప్రదేశాల్లో కాలిస్తే ప్రమాదం బారిన పడే అవకాశం ఉంది. కాటన్ దుస్తులు ధరించాలి. టపాసుల విక్రయదారులు కూడా జాగ్రత్తలు పాటించాలని ఇప్పటికే ఆదేశాలు ఇచ్చాం. దుకాణాల మధ్య దూరం ఉండాలని నీళ్ల డ్రమ్ములు, ఇసుక సిద్ధంగా ఉంచుకోవాలని సూచించాం.

– ధర్మారావు,
జిల్లా అగ్నిమాపకశాఖ అధికారి

దీపావళిని సురక్షితంగా జరుపుకోండి

కడప కోటిరెడ్డిసర్కిల్ : దీపావళి పండుగ సందర్భంగా కాల్చే బాణాసంచా విషయంలో జాగ్రత్తలు తీసుకోవాలని, ముఖ్యంగా కంటి విషయంలో అత్యంత అప్రమత్తంగా ఉండాలని ఎల్‌వీపీఈఐ వైద్యురాలు డాక్టర్ కావ్య మాధురి బెజ్జంకి సూచించారు. శనివారం కడపలోని ఎల్‌వీ ప్రసాద్ నేత్ర వైద్యశాల రాజశేఖర్ రెడ్డి చౌదరి క్యాంపస్ వద్ద ఏర్పాటు చేసిన అవగాహన సదస్సులో ఆమె మాట్లాడారు. ఈ పండుగలో అత్యంత ఆనందంతోపాటు ప్రమాదం కూడా పొంచి ఉందని గమనించాలన్నారు. ఒకవేళ ప్రమాదవశాత్తు కంటికి గాయమైతే సున్నితంగా శుభ్రం చేసి, కంటిలో ఏదైనా నలకలు ఉంటే, వాటిని శుభ్రమైన నీరు లేదా సెలైన్‌తో శుభ్రం చేయాలన్నారు. కంట్లో నలకలు తొలగించడానికి ఇంట్లో ఉన్న ఏదైనా ఇతర పదార్థాలను ఉపయోగించరాదన్నారు. గాయపడిన కన్ను మూసి ఉంచాలని అలాగే గాయపడిన వ్యక్తిని వెంటనే కంటి సంరక్షణ నిపుణుల వద్దకు తీసుకువెళ్లాలన్నారు. నేత్ర వైద్యుల పర్యవేక్షణ లేకుండా ఇంటి వైద్యం చేయడం వలన ఒకోసారి చూపు కోల్పోవాల్సి వస్తుందన్నారు. పిల్లలు టపాకాయలు కాలుస్తున్నప్పుడు పెద్దలు తప్పనిసరిగా పర్యవేక్షించాలన్నారు. ఏదైనా ప్రమాదం సంభవిస్తే కడప ఎల్‌వీ ప్రసాద్ నేత్ర వైద్యశాల అత్యవసర హెల్ప్‌లైన్ నెంబర్లు 0856 2350600, 95158 89641లలో సంప్రదించాల్సిందిగా కోరారు.

పెండ్లిమర్రి ఎస్ఐ మధుసూదన్‌రెడ్డి సస్పెన్షన్

ఉత్తర్వులు జారీ చేసిన కర్నూలు రేంజ్ డీఐజీ డాక్టర్ కోయప్రవీణ్



కడప అర్బన్ : పెండ్లిమర్రి పోలీస్ స్టేషన్‌లో ఎస్ఐగా విధులు నిర్వహిస్తున్న జి.మధుసూదన్‌రెడ్డిని సస్పెండ్ చేస్తూ ఈనెల 17న కర్నూలు రేంజ్ డీఐజీ డాక్టర్ కోయప్రవీణ్ ఉత్తర్వులు జారీ చేశారు. ఎస్ఐ తమ విధి నిర్వహణలో తీవ్ర నిర్లక్ష్యం వహించారని తమ దృష్టికి వచ్చిందని డీఐజీ తమ ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. ఈ ఏడాది మార్చి 30న పెండ్లిమర్రి పోలీస్ స్టేషన్ పరిధిలో నమోదైన కేసులో మృతుడు సుబ్బయ్య భార్య సుధా లలిత ఇచ్చిన ఫిర్యాదు మేరకు 194 బి.ఎన్.ఎస్.ఎస్ (మరణానికి కారణం తెలియదు) సెక్షన్ కింద కేసు నమోదు చేశారు. ఈ ఏడాది మార్చి 29న పెండ్లిమర్రి మండలం, మాచనూరు సమీపంలోని చౌటపల్లి గ్రామానికి చెందిన సుధా సుబ్బయ్య(46) అనే వ్యక్తి బాల అంకిరెడ్డికి చెందిన స్థలంలో మృతదేహమై కనిపించాడు. దీంతో మృతుని భార్య సుధా లలిత తన భర్త మరణంపై అనుమానం వ్యక్తం చేస్తూ ఫిర్యాదు చేశారు. అయితే మృతుడు వడదెబ్బ కారణంగా మరణించి ఉండవచ్చని ఎస్ఐ పేర్కొన్నారు. మృతదేహాన్ని పోస్టుమార్టం పరీక్ష కోసం పంపారు. ఈ ఏడాది మే 23న కడపలోని ప్రభుత్వ వైద్య కళాశాల ఫోరెన్సిక్ మెడిసిన్ విభాగం అసోసియేట్ ప్రొఫెసర్ డాక్టర్ ఎస్. సుధాకర్ నుంచి ఎస్ఐకి పోస్టుమార్టం సర్టిఫికేట్ లభించింది. అసిస్టెంట్ ప్రొఫెసర్ నివేదిక ఆధారంగా మృతుడు 'ఆర్గానోఫాస్ఫేట్ విష ప్రయోగం' కారణంగా మరణించాడని తెలుస్తోంది. ఈ నేపథ్యంలో ఈనెల8న మృతుడు సుధా సుబ్బయ్య తండ్రి సుధా నారాయణ ఎస్పీని, ఉన్నతాధికారులను సంప్రదించారు. తన కుమారుడు సుధా సుబ్బయ్యను బాల అంకిరెడ్డికి చెందిన వేరుశనగ కొట్టే ప్రదేశానికి తీసుకెళ్లారని, అక్కడ అతనికి విషం ఇచ్చి చంపారని పేర్కొంటూ ఆయన పిటిషన్ దాఖలు చేశారు. తన చిన్న కుమారుడు సంఘటనా స్థలానికి చేరుకున్నప్పుడు బాల అంకి రెడ్డి పారిపోయాడని సుధా నారాయణ పేర్కొన్నారు. ఎస్ఐ మధుసూదన్‌రెడ్డి మాత్రం సుధా సుబ్బయ్య వడదెబ్బ కారణంగానే మరణించడంటూ వాదిస్తూ వచ్చారు. దీంతో ఈ సంఘటనను సీరియస్‌గా తీసుకున్న జిల్లా ఎస్పీ షెల్కేనచికేత్ విశ్వనాథ్, కడప మహిళా పోలీస్ స్టేషన్ డీఎస్పీ బాలస్వామిరెడ్డిని విచారణ చేయాలని ఆదేశించారు. ఆయన విచారణ చేసి, ఎస్పీ ద్వారా కర్నూలు రేంజ్ డీఐజీకి నివేదిక పంపారు. దీంతో ఆయన ఎస్ఐ మధుసూదన్‌రెడ్డిని సస్పెండ్ చేస్తూ ఉత్తర్వులు జారీ చేశారు.

బాలికపై మేనమామ వేధింపులు

- తల్లితో కలిసి చితకబాదిన వైనం
- బద్వేలులో ఘటన
- కైకలూరు ప్రభుత్వాసుపత్రిలో బాలికకు చికిత్స



బాలిక కాలిపై గాయాలు

కైకలూరు : మేనమామ వేధించడంతో పాటు తల్లి, అమ్మమ్మ, తాత చిత్రహింసలకు గురిచేశారని 9వ తరగతికి చెందిన బాలిక బావురుమంది. నరకం నుంచి బయటపడ్డానని గాయాలను చూపించింది. ఈ ఘటన ఏలూరు జిల్లా కైకలూరు మండలం చటాకాయికి చెందిన బాలికపై వైఎస్సార్ కడప జిల్లా బద్వేలు సమీప అగ్రహారంలో జరగ్గా ఆలస్యంగా వెలుగు చూసింది. శనివారం ఆమెను తండ్రి కైకలూరు ప్రభుత్వాస్పత్రికి తీసుకువచ్చాడు. పోలీసులకు ఆమె వివరాలు వెల్లడించింది. బాధితురాలు, ఆమె తండ్రి తెలిపిన వివరాల ప్రకారం.. చటాకాయికి చెందిన జయమంగళ కుమార అభిమన్యుడుకి ఏలూరు మండలం శ్రీపర్రుకు చెందిన కామాక్షితో 2009లో వివాహమైంది. వీరికి 2012లో అమ్మాయి జన్మించింది. అనంతరం ఇద్దరి మధ్య విభేదాలు రావడంతో విడాకులు తీసుకున్నారు. అప్పటినుంచి కుమార్తె తండ్రి వద్ద ఉంటోంది. కామాక్షి మరో వ్యక్తిని వివాహం చేసుకోగా.. అభిమన్యుడు మరో మహిళను వివాహం చేసుకున్నాడు. మొదటి భార్య కుమార్తె (14) తండ్రి వద్దే ఉంటూ భుజబలపట్నం హైస్కూల్‌లో 9వ తరగతి చదువుతోంది.

దసరా పండక్కి తీసుకెళ్లి..

తండ్రి లేని సమయంలో కామాక్షి, ఆమె తల్లి చటాకాయలో ఉంటున్న బాలిక వద్దకు వచ్చి దసరా పండగకు దుస్తులు కొంటామని ప్రత్తికోళ్లలంక, అక్కడ నుంచి కామాక్షి సోదరుడు ఉమాశంకర్, తల్లిదండ్రులు నాగులమ్మ, వెంకటరమణ ఉంటున్న కడప జిల్లా బద్వేలుకు తీసుకువెళ్లారు. బాలికను అక్కడే ఉండాలని బలవంతం చేయడంతో ఆమె నిరాకరించి తండ్రి వద్దకు వెళతానని చెప్పింది. దీంతో తన తల్లి కామాక్షి ఇష్టానుసారం తనను కొట్టిందని బాలిక వాపోయింది. మేనమామ ఉమాశంకర్ తనతో అసభ్యంగా ప్రవర్తించాడని పోలీసులకు చెప్పింది. బద్వేలులో బాలిక పరిస్థితిని చూసిన ఓ వ్యక్తి తండ్రి అభిమన్యుడికి ఫోన్ చేయగా అక్కడికి వెళ్లి శుక్రవారం రాత్రి చటకాయకు తీసుకువచ్చారు. మేనమామ బాలికతో అసభ్యంగా ప్రవర్తించాడా? లేదా అన్న విషయాన్ని బద్వేలు పోలీసులు విచారిస్తారని కైకలూరు రూరల్ ఎస్ఐ వి.రాంబాబు తెలిపారు. బాలిక విషయంలో తల్లిదండ్రులకు విభేదాలు ఉన్నాయన్నారు. ఫిర్యాదును బద్వేలు పంపామని చెప్పారు.

రోడ్డు ప్రమాదంలో గుర్తుతెలియని వృద్ధుడి దుర్మరణం



ప్రమాదంలో మృతి చెందిన వృద్ధుడు

ముద్దనూరు : ముద్దనూరు –పులివెందుల రహదారిలోని వంక సమీపంలో శనివారం రోడ్డు ప్రమాదంలో గుర్తుతెలియని వృద్ధుడు(70) దుర్మరణం చెందాడు. ఓ భారీ వాహనం ఢీకొనడంతో వృద్ధుడు మృతి చెందగా గుర్తు పట్టేందుకు ఎలాంటి ఆధారాలు లభించలేదని సీఐ దస్తగిరి తెలిపారు. వృద్ధుని వివరాలు తెలిస్తే పోలీసులను సంప్రదించాలని సీఐ కోరారు.

ఏపీ ఎక్సైజ్ సురక్ష యాప్ ద్వారా మద్యం అమ్మకాలు



మద్యం దుకాణాన్ని తనిఖీ చేస్తున్న జిల్లా ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ డిప్యూటీ కమిషనర్

కడప వైఎస్‌ఆర్ సర్కిల్ : ఉమ్మడి కడప జిల్లాలో కల్తీ మద్యానికి చెక్ పెట్టేందుకు ప్రభుత్వం ఏపీ ఎక్సైజ్ సురక్ష యాప్‌ను ప్రవేశ పెట్టిందని జిల్లా ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ డిప్యూటీ కమిషనర్ జయరాజు పేర్కొన్నారు. శనివారం జిల్లాలోని కడప నగరం, బద్వేలు, సిద్దవటం పరిధిలోని మద్యం దుకాణాల్లోని అమ్మకాలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మద్యం కొనుగోలు చేసే వ్యక్తి ఏపీ ఎక్సైజ్ సురక్ష యాప్‌ను డౌన్‌లోడ్ చేసుకోవడం ద్వారా స్కాన్ చేయగానే మద్యం తయారీ, ధర, తయారు చేసిన కంపెనీ, ఏ మద్యం దుకాణంలో విక్రయించారు అనే వివరాలు పొందవచ్చన్నారు. కార్యక్రమంలో జిల్లా ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ సూపరింటెండెంట్ రవికుమార్, కడప స్టేషన్ సీఐ కృష్ణకుమార్, సిబ్బంది పాల్గొన్నారు.

పరిమి శ్రీరామనాథ్‌కు గడియారం సాహిత్య పురస్కారం



పరిమి శ్రీరామనాథ్

కడప సెవెన్‌రోడ్స్ : హైదరాబాదుకు చెందిన యువ కవి, సాఫ్ట్‌వేర్ ఇంజినీర్ పరిమి శ్రీరామనాథ్ 'మహాకవి' డాక్టర్ గడియారం వేంకట శేషశాస్త్రి 44వ సాహిత్య పురస్కారానికి ఎంపికైనట్లు రచన సాహిత్య వేదిక కార్యదర్శి డాక్టర్ భూతపురి గోపాల కృష్ణ శాస్త్రి తెలిపారు. పురస్కార ప్రదాన సభ రచన సాహిత్య వేదిక, గడియారం కుటుంబీకుల సంయుక్త ఆధ్వర్యంలో ఈనెల 26వ తేది సాయంత్రం 5:30 గంటలకు ప్రొద్దుటూరులోని అరవిందాశ్రమంలో నిర్వహిస్తున్నామన్నారు. 1982 నుంచి ప్రతి ఏటా రాష్ట్ర స్థాయిలో ఎంపికైన కావ్యానికి బహూకరిస్తూ వస్తున్న ఈ అవార్డుకు 2025 సంవత్సరానికి పరిమి శ్రీరామనాథ్ రచించిన 'జీవాతువు' అనే కావ్యం ఎంపికైనట్లు తెలిపారు. పురస్కార ప్రదాన సభలో శ్రీరామనాథ్‌కు కవి సన్మానం, అవార్డుకు గాను రూ.10,000 నగదు బహుమతి, పురస్కారపత్రం, ప్రశంసాపత్రం అందజేయనున్నట్లు తెలిపారు.

యువకుడి ఆత్మహత్య



జగదీష్ (ఫైల్‌ఫొటో)

చక్రాయపేట : మండలంలోని గండి కొవ్వూరు గ్రామం ఓబుళనాయునిపల్లెలో గండికోట జగదీష్(18) అనే యువకుడు తమ ఇంటిలోనే ఉరివేసుకొని ఆత్మహత్య చేసుకున్నట్లు ఎస్ఐ చంద్రశేఖర్ తెలిపారు. మృతుడి బంధువుల ఫిర్యాదు మేరకు ఎస్ఐ తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. జగదీష్ తల్లిదండ్రులు జనార్దన, పావని జీవనోపాధి నిమిత్తం కువైట్‌లో ఉన్నారు. లక్కిరెడ్డిపల్లెలోని అమ్మమ్మ ఇంటివద్ద జగదీష్ ఉండేవారు. తనకు బుల్లెట్ బైకు కొనివ్వమని ఫోన్ చేసి వత్తిడి తేవడంతో తండ్రి మందలించాడని మనస్థాపానికి గురై లక్కిరెడ్డిపల్లె నుంచి ఓబుళనాయునిపల్లెలో ఉన్న ఇంటికు వచ్చాడు. శుక్రవారం అర్ధరాత్రి సమయంలో ఉరివేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. జగదీష్ ఫోన్ పనిచేయక పోవడంతో పాటు అలిగి వచ్చాడని అతని అమ్మమ్మ శనివారం ఓబుళనాయునిపల్లెలోని ఇంటి వద్దకు వచ్చి తలుపు తీయగా జగదీష్ ఉరివేసుకుని ఉండటాన్ని గమనించింది. గట్టిగా కేకలు వేయడంతో ఇరుగు పొరుగు వారు వచ్చి సమాచారాన్ని పోలీసులకు చేరవేశారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం వేంపల్లె ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు.

అర్ధరాత్రి లిఫ్ట్ ఇచ్చి దోపిడీ చేశారు

మదనపల్లె రూరల్ : అర్ధరాత్రి వేళ బస్సు దిగి ఇంటికి నడుచుకుంటూ వెళుతున్న వ్యక్తికి లిఫ్ట్ ఇస్తామని బలవంతంగా బైక్‌లో ఎక్కించుకుని దారిదోపిడీ చేసిన ఘటన శుక్రవారం అర్ధరాత్రి మదనపల్లెలో జరిగింది. పట్టణంలోని సత్సంగ్ స్కూల్ సమీపంలో నివాసం ఉన్న విజయ్‌కుమార్‌రెడ్డి బెంగళూరులో సాఫ్ట్‌వేర్ ఇంజినీర్‌గా పనిచేస్తున్నాడు. శుక్రవారం రాత్రి బెంగళూరులో ఆత్మకూరు బస్సులో బయలుదేరి రాత్రి 12.45 గంటల సమయంలో నక్కలదిన్నె తండా వద్ద దిగి ఇంటికి నడిచి వెళుతున్నాడు. ఆ సమయంలో అక్కడే కాపు కాసిన గుర్తుతెలియని వ్యక్తులు బైక్‌పై అతడి వద్దకు వచ్చి లిఫ్ట్ ఇస్తామని బలవంత పెట్టారు. అతడు వద్దని చెప్పినా వినిపించుకోకుండా బలవంతంగా బైక్‌లోకి ఎక్కించుకున్నారు. కొంతదూరం వెళ్లాక బైక్ నిలిపి అతడి వద్ద ఉన్న రూ.20వేల నగదు, 15 గ్రాముల బంగారు చైను దోచుకున్నారు. బాధితుడు వన్‌టౌన్ పోలీస్‌స్టేషన్‌లో దోపిడీ ఘటనపై ఫిర్యాదు చేయగా, ఎస్ఐ శివకుమార్ కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ మహమ్మద్ రఫీ తెలిపారు.

సాక్షిపై వేధింపులు సరికాదు



రెడ్యం వెంకటసుబ్బారెడ్డి

ఖాజీపేట : నకిలీ మద్యం దోపిడీని వెలుగులోకి తీసుకు వస్తున్న సాక్షి ఎడిటర్, పత్రికా విలేకరుల పై కేసులు నమోదు చేయడం పత్రికా స్వేచ్ఛను హరించడమే అని వైఎస్సార్‌సీపీ రాష్ట్ర కార్యదర్శి రెడ్యం వెంకట సుబ్బారెడ్డి అన్నారు. దుంపలగట్టు గ్రామంలో విలేకరు సమావేశంలో ఆయన మాట్లాడుతూ కూటమి సర్కార్‌కు కొన్ని పత్రికలు వత్తాసు పలుకుతూ ఉంటే నిజాలను నిర్భయంగా వెలుగులోకి తీసుకు వచ్చింది ఒక్క సాక్షి దినపత్రిక మాత్రమే అన్నారు. ప్రతి పక్ష పాత్ర పోషిస్తూ కూటమి ప్రభుత్వ తప్పులను ప్రజలకు వివరిస్తున్న పత్రికల గొంతు నొక్కేయాలనుకోవడం ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేయడమే అన్నారు. కూటమి ప్రభుత్వ దౌర్జన్యాలకు బుద్ధి చెప్పే రోజులు దగ్గరలోనే ఉన్నాయన్నారు.

నేడు టీచర్స్ హౌస్ బిల్డింగ్ సొసైటీ సమావేశం

కడప ఎడ్యుకేషన్: కడప జిల్లా టీచర్స్ హౌస్ బిల్డింగ్ సొసైటీ సర్వసభ్య సమావేశాన్ని 19వ తేదీ ఆదివారం నిర్వహిస్తున్నట్లు కడప జిల్లా టీచర్స్ హౌస్ బిల్డింగ్ సొసైటీ అధ్యక్ష కార్యదర్శులు చల్లా విశ్వనాథరెడ్డి, లింగాల బౌలశౌరిరెడ్డిలు ఒక ప్రకటనలో తెలిపారు. కడపలోని సీఎస్ఐ హైస్కూల్‌లో ఉదయం 9.30 గంటలకు సమావేశం ప్రారంభమవుతుందన్నారు. ఈ సమావేశంలో పబ్బాపురం ప్లాట్స్ సమస్య ప్రధాన అంశంగా చర్చిస్తామన్నారు.

ఎస్‌జీఎఫ్ ఎంపికల తేదీల మార్పు

కడప వైఎస్‌ఆర్ సర్కిల్ : ఈ నెల 21 నుంచి 29 వరకు స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ (ఎస్‌జీఎఫ్)లో భాగంగా అండర్–14, 17 బాల బాలికలకు వివిధ క్రీడాంశాల్లో జరిగే ఎంపికల్లో కొన్ని తేదీలను మార్పు చేసినట్లు ఎస్‌జీఎఫ్ సెక్రటరీ చంద్రావతి పేర్కొన్నారు. ఈ మార్పును క్రీడాకారులు, కోచ్‌లు, ఉపాధ్యాయులు గమనించాలన్నారు.

తేదీ	క్రీడాంశం	వేదిక
21	హాకీ	డాక్టర్ వైఎస్‌ఆర్ క్రీడా పాఠశాల
24	బ్యాడ్మింటన్	డీఎస్‌ఏ ఇండోర్ స్టేడియం, కడప
	వాలీబాల్	జగతి మాంటిస్సోరి స్కూల్, కడప
25	క్రికెట్	డీఎస్‌ఏ నెట్ స్టేడియం, కడప
	బాస్కెట్ బాల్	డీఎస్‌ఏ స్టేడియం, కడప
	ఖోఖో	మున్సిపల్ ఉర్దూ హై స్కూల్, కడప
	హ్యాండ్ బాల్	ఏపీఆర్ఎస్, గండి, వేంపల్లి
27	కబడ్డీ	ప్రభుత్వ హైస్కూల్, నేతాజీ సర్కిల్, రాయచోటి
	సాఫ్ట్‌బాల్	జెడ్పీ హైస్కూల్, మాసాపేట, రాయచోటి
	బేస్‌బాల్	జెడ్పీ హైస్కూల్, మాసాపేట, రాయచోటి
28	చెస్	డీఎస్‌ఏ ఇండోర్ స్టేడియం, కడప
	యోగా	డీఎస్‌ఏ ఇండోర్ స్టేడియం, కడప
	కబడ్డీ	హెచ్ఎంఎం హై స్కూల్, రైల్వే కోడూరు
29	అథ్లెటిక్స్	డాక్టర్ వైఎస్‌ఆర్ క్రీడా పాఠశాల, కడప

షార్టు సర్క్యూట్‌తో టీ షాపు దగ్ధం

రాయచోటి టౌన్ : రాయచోటి – చిత్తూరు రోడ్డులోని రింగ్ రోడ్డులోని మిస్టర్ టీ షాపు విద్యుత్ షార్ట్ సర్క్యూట్‌తో కాలిపోయింది. శుక్రవారం సాయంత్రం టీషాపు నిర్వహిస్తున్న సమయంలో విద్యుత్ సర్క్యూట్‌తో ఒక్కసారిగా షాపులో మంటలు రేగాయి. దీంతో ఆ షాపులో ఉన్న తినుబండారాలు, టీ మెటీరియల్, ఇతర వస్తువులు పూర్తిగా దగ్ధమయ్యాయి. స్థానికులు వెంటనే మంటలు ఆర్పే ప్రయత్నం చేసినా ఫలితం లేకపోయిందని మిస్టర్ టీ షాపు నిర్వాహకుడు ఆవేదన వ్యక్తం చేశారు. ఈ మంటలలో సుమారు రూ.2లక్షలకు పైగా నష్టం వాటిల్లిందని తెలిపారు. దీనిపై అగ్నిమాపక అధికారులు దర్యాప్తు చేస్తున్నారు.

పెన్నానదిలో యువకుడి గల్లంతు

సిద్దవటం : మండలంలోని వంతాటిపల్లి గ్రామం ఎస్సీ కాలనీకి చెందిన పెయ్యల నంద (36) అనే యువకుడు శనివారం పెన్నానదిలో గల్లంతయ్యాడు. వంతాటిపల్లి గ్రామ సమీపంలో ఉన్న పెన్నానది వద్దకు చేపలు పట్టేందుకు వెళ్లి ప్రమాదవశాత్తూ పెన్నానది నీటిలో పడిపోయాడు. సమాచారం తెలుసుకున్న సిద్దవటం పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని గల్లంతైన యువకుడి కోసం గాలింపు చర్యలు చేపట్టారు. అతని ఆచూకీ లభించకపోవడంతో గజ ఈతగాళ్లను తెప్పించి గాలింపు చేపట్టారు.